ప్రజా విశ్వంభర V3 NEWS

# చేనేతకు చేయూత అవసరం




సనాతన సాంప్రదాయాలకు, ప్రాచీన సంస్కృతికి అనాదిగా ఆలవాలమైన భారత దేశంతో చేనేత విడదీయలేని బంధం అనుబంధం, సంబంధం కలిగి ఉంది. భారతీయత సాంస్కృతిక కళలలో ముఖ్యమైనదై, వారసత్వానికి ప్రతీక అయిన చేనేత కళ దేశానికి గర్వకారణం.

జాతీయ చేనేత దినోత్సవం ఆగస్టు 7న దేశవ్యాప్తంగా ప్రతి ఏట నిర్వహిస్తారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రధాన భూమిక పోషించి, స్వాతంత్ర్య సమపార్జనకు ఒక సాధనంగా నిలిచింది చేనేత. గాంధీజీ కూడా రాట్నంపై నూలు వడకడానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. అంతటి ప్రాధాన్యత కలిగిన చేనేత రంగానికి ఒకరోజు ఉండాలన్న ఉద్దేశ్యంతో జాతీయ చేనేత దినోత్సవంను ఏర్పాటు చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన యర్రమాద వెంకన్న నేత చేనేత దినోత్సవానికి సరైన తేదీ కోసం అధ్యయనం చేశారు. భారత స్వాతంత్ర్య ఉద్యమం జరుగుతున్న సమయంలో విదేశీ వస్త్రాలను బహిష్కరించాలన్న లక్ష్యంతో స్వదేశీ ఉద్యమం వచ్చింది. మొదటిసారిగా 1905లో బెంగాల్ రాష్ట్ర రాజధాని కలకత్తాలోని టౌన్‌హాల్‌లో 1905 ఆగస్టు 7న భారీ సమావేశం నిర్వహించి విదేశీ వస్త్రాలను బహిష్కరించడంతో పాటూ దేశీయోత్పత్తుల పునరుద్ధరణకు పిలుపునిచ్చారు. అలా విదేశీ వస్తు బహిష్కరణలో కీలకపాత్ర వహించిన ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా చేయాలని నిర్ణయించారు.

భారతీయ చేనేతకు వేల సంవత్సరాల చరిత్ర ఉంది, ప్రపంచంలో అతి కొద్ది దేశాలకు మాత్రమే ఈ ఘనత ఉంది. పురాతన కాలంనుంచి భారతీయ చేనేత వస్త్రాలు ప్రపంచమంతా ఎగుమతులు చేయబడేవి. భారతదేశంలో అతి ప్రాచీన పరిశ్రమ ఇది. ఒకప్పుడు దేశానికి పేరు, డబ్బు తెచ్చిన, వందల ఏళ్ల క్రితం నుంచీ విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించిన ఘనత ఈ పరిశ్రమకు ఉంది. శాతవాహనుల కాలంలో ఇక్కడి వస్త్రాలు యూరప్‌కి ఎగుమతి అయిన ఆధారాలున్నాయి. రెండువేల సంవత్సరాల క్రితం 'హంస' డిజైన్లతో ఉన్న భారతీయ వస్త్రాలు ఈజిప్టు కైరో నగరంలో లభ్యమయాయి.

కాలక్రమేణా బ్రిటిష్ పాలనలో, ఆ తరువాత పారిశ్రామికీకరణలో ఈ రంగం భారీగా దెబ్బతిన్నది. అగ్గిపెట్టెలో పట్టే మస్లిన్ చీరలను నేసిన ఘనచరిత్ర ఉన్న దేశం మనది. తరతరాలుగా చేనేత కుటుంబాలలో వారసత్వ కళగా ఇది కొనసాగుతోంది. కొన్ని కుటుంబ సభ్యులంతా కలిసి మగ్గాల మీద బట్ట నేస్తుండడం మనకు కనిపిస్తుంది. ప్రముఖ చేనేత కేంద్రాలలోని గ్రామాలలో, మొత్తంగా నేతపనిలో నిమగ్నమై ఉంటారు. ఉపాధి విషయంలో వ్యవసాయం తరువాత చేనేతది రెండవ స్థానం, కుటీర పరిశ్రమల కింద కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తున్నది చేనేత పరిశ్రమ. ప్రత్యక్షంగా, పరోక్షంగా 70లక్షల మందికి పైగా ఈ పరిశ్రమ ఉపాధి కల్పిస్తోంది, వీరు మగ్గాల మీద నేసిన వస్త్రాలు, దేశం మొత్తం వస్త్రాల ఉత్పత్తిలో 20% పైగా ఉంటాయి. ప్రపంచ చేనేత వస్త్రాలలో 90% పైగా భారత దేశంలో నేయబడతాయి. భారత దేశంలో దాదాపు 150 చేనేత కేంద్రాలు ఉన్నాయని అంచనా. నూలు, కాటన్, సిల్క్, పట్టు, ఇతర సహజంగా ఉపలబ్ధమయ్యే నార, పీచులతో అద్భుతమైన వస్త్రాలు తయారు చేస్తారు చేనేత కళాకారులు.

2008 నుండి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా జరుపుతుంది. 2008, ఆగస్టు 7న హైదరాబాదు లోని రవీంద్రభారతిలో జరిగిన చేనేత దినోత్సవ వేడుకలకు నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హాజరైనారు. 2012, ఏప్రిల్ 6న రవీంద్ర భారతిలో వెంకన్న సారధ్యంలో చేనేత దినోత్సవ చరిత్ర, ఆవశ్యకతను వివరిస్తూ స్వదేశీయం సంగీత నృత్య రూపకం ప్రదర్శించారు. 2012, ఆగస్టు 7న దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట నుండి రాజ్ ఘాట్ వరకు చేనేత వాక్ చేసి జాతీయ స్థాయిలో ఈ దినోత్సవంపై ఆసక్తిని కలిగించారు. 2014లో అదే రాజ్ ఘాట్ లో చేనేత దినోత్సవ ర్యాలీకి ముఖ్య అతిథిగా వచ్చిన అప్పటి కేంద్ర జౌళీ శాఖ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ ప్రధానితో చర్చించి చేనేత దినోత్సవాన్ని అధికారికం చేస్తామని మాటిచ్చారు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాల, కేంద్ర ప్రాంత ప్రభుత్వాల అంగీకారంతో 2015, జూలై 29న భారత ప్రభుత్వం ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా అధికారిక గెజిట్ విడుదల చేసింది. 2015, ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని భారత ప్రధాని నరేంద్ర మోడీ చెన్నైలో అధికారికంగా ప్రారంభించారు.

చేనేత పరిశ్రమ నేడు కుంటుపడింది. అనేక లోటుపాట్ల కారణంగా చేనేత కుటుంబాలకి గిట్టుబాటు ధర లభించడం లేదు. ముడి సరుకు అందుబాటులో లేకపోవడం - దారం, నూలు, చెట్ల పూల రంగులు; కొనుగోలు చేయడానికి ఎంతో దూరాలు వెళ్ళాల్సిరావడం; ముడి సరుకు ధరలు పెరుగుదల కాటన్/నూలు, సిల్క్, జనప ధరలు పెరగడం; ఎరువులు పురుగు మందులు, రసాయనాల ధరలు పెరగడం వల్ల కాటన్ ధరలు విపరీతంగా పెరిగాయి. చేనేత రంగంలో మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు లేకపోవడం; ఎన్నో ప్రాంతాల్లో పరిశ్రమ కనీసావ సరాలైన స్థలం, నీళ్ళు, విద్యుత్తు కూడా అందుబాటులో ఉండవు. రంగులు డిజైన్లు క్షణక్షణం మారుతుంటాయి. కొత్త డిజైన్ల కొరత పరిశ్రమను దెబ్బతీస్తోంది. ఇది చేనేత కళాకారులు చేయలేక కాదు, డబ్బు పెట్టేవాళ్ళు 'రిస్క్' లేకుండా వ్యాపారం చేయాలనుకోవడం కారణం. మార్కెట్ల వ్యవస్థ సదుపాయాలు లేకపోవడం. చేనేత పరిశ్రమ ఉత్పత్తులకు 'పేటెంట్' లేకపోవడం వల్ల రక్షణ లేదు, అన్ని సంప్రదాయ డిజైన్లు అనుకరించి నకళ్ళు చేస్తున్నారు. చేనేత సహకార సంస్థలు రాజకీయ జోక్యం వల్ల, అవినీతి వల్ల నష్టాల పాలయాయి. కేంద్ర రాష్ట్ర బడ్జెట్లలలో సరైన నిధుల కేటాయింపులు లేకపోవడం, చేనేత డిజైన్లు నకలు/ కాపీ చేసి, పవర్లూమ్లులు అవే చేనేత అని చెప్పుకుని చెలామణి అయిపోతున్నాయి. తెలంగాణలో చేనేత రంగంలోని 40 వేల కుటుంబాలకు సంక్షేమ కార్యక్రమాలు అమల వుతున్నాయి. పోచంపల్లి, ఆలేరు, కనుకుల, శాయంపేట, కమలాపూర్, ఆర్మూర్, వెల్టూర్, వేములవాడలో బ్లాక్ లెవల్ క్లస్టర్లు ఏర్పాటు అయ్యాయి. పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కు అభివృద్ధికి రూ.15 కోట్లు కేటాయించారు.

లాక్ డౌన్ మరింత ప్రమాదంలోకి తోసింది. చేనేత, మరనేత రంగాలు ఇప్పుడు ఇదే ఇబ్బందుల్లో ఉన్నాయి. లాక్ డౌన్ వల్ల బట్టల వ్యాపారం పూర్తిగా ఆగిపోయింది. దీని ప్రభావం నేత కార్మికులపై తీవ్రంగా ఉంది.

ప్రస్తుతం నేత కార్మికులుగా... ఒకరు చేతితో మగ్గంపై నేతనేసే వారు, చేనేత కార్మికులు. రెండోవారు, కరెంటు మెషీన్ల మీద నేతనేసేవారు మరనేత కార్మికులు. లాక్ డౌన్ ఇప్పుడు ఇద్దర్నీ ఇబ్బంది పెడుతోంది. ప్రభుత్వాలు చేనేత రంగానికి తగు ప్రోత్సాహం అందించడంతో పాటు,

ప్రతి భారతీయుడు, తాము కొనే వస్త్రాలలో, దుప్పట్లు, తువాళ్ళు, కర్టెన్లు మొదలైన నిత్యం వాడే వస్తువుల్లో, కనీసం 1520% చేనేత తయారీలు వాడగలిగితే, మన ప్రాచీన సాంస్కృతిక సంపద, వారసత్వం మనగలుగుతుంది. చేనేత మీద ఆధారపడ్డ లక్షలాది కుటుంబాలు మనుగడ సాగించగలుగుతాయి.

# గొర్రెల మంద x జెన్ జీ

దేశంలోని రెండు శక్తుల మధ్య ఓ పోరాటం మొదలైంది. ఒకటి మెదడు ఉపయోగించని గొర్రెల మంద, రెండోది ఉన్నత చదువులు చదువుకొని తాము పొందిన జ్ఞానంతో తమ జీవితాలను తామే తీర్చిదిద్దుకునే ప్రయత్నాల్లో ఉన్న జెన్ జీ/నిరుద్యోగ యువత. చదువూ సంధ్య లేని, అధికారానికి సాగిలపడి అనేక అరాచకాలకు పాల్పడుతూ సర్కారు సేవలో తరించిపోతున్న ఓ గొర్రెల మంద. ఈ మంద తీరును ఓ దశాబ్ద కాలంగా మనం చూస్తూనే ఉన్నాం. అధికార వ్యవస్థ చేసిన చేస్తున్న అక్రమాలు అవినీతిపై జెన్ జీ తిరగబడింది.

పరీక్షా పత్రాల లీకేజీలు, ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు, అవకతవకలు, విద్యా వ్యవస్థలో చొర బడుతున్న అరాచక శక్తులను చూసి చూసి విసిగిపోయి ఒక్కసారిగా వీధుల్లోకి వచ్చింది జెన్ జీ. నిరసనలు, ఆందోళనలకు పూనుకుంది. వీధుల్లోకి వచ్చింది. అక్రమాలను నిలదీసింది. అక్రమాలపై జవాబుదారీతనం కోరుతూ భారీ ఆందోళనను చేపట్టింది. 20 యేళ్లకు పైగా ఎంతో శ్రమించి చదువుకొని పై చదువుల కోసం, ఉద్యోగాల కోసం శ్రమిస్తున్న జెన్ జీ చేస్తున్న ఆందోళన అధికారానికి, దాని గొర్రెల మందకు మింగుడు పడలేదు. ఈ గొర్రెల మందకు ఏమీ అర్థం కాదు. చదువు, సంధ్య లాంటివి లేని మూక కదా.

దీనికి ఏమి చెప్పినా అర్థం కాదు. అవి తమ మెదడును ఉపయోగించవు కదా. వాటికి మంచిచెడు అనే విచక్షణ కూడా ఏమీ లేదు. తమ యజమాని ఏమి చెబితే ఆ పనిని గుడ్డిగా చేసెయ్యడమే తెలుసు. అలాంటి మందకు జ్ఞాన బోధ చేసే ప్రయత్నాలు గతంలో ఈ దేశ పౌర సమాజం చేసింది. కానీ ఆ ప్రయత్నం ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. అలాంటి గొర్రెల మందకు జ్ఞానబోధ అవసరమా ?అనే ప్రశ్న వేస్తే? వేసుకుంటే? అనవసరమే అనే జవాబు వస్తున్నది. అలాంటి గొర్రెలకు బోధన ఏమిటి! అదొక వెర్రి ప్రయత్నమే అనే అభిప్రాయమూ వ్యక్తమవుతున్నది. అదొక నిరుపయోగమైన కార్యక్రమం మాత్రమే అవుతుందని గత ప్రయత్నాలు చెప్పాయి. ఇక అలాంటి ప్రయత్నాలు కూడా అనవసరమే అనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతున్నది నిజమే అది ఒక అనవసర యత్నమే.

ఎందుకు?ఎలా?అంటే....

అవి గొర్రెలు కదా. వాటికి మెదడు అనే అవయవం ఉండవచ్చును. కాని.... దానిని ఉపయోగించడం వాటికి తెలియదు కదా. తలను కిందికి వేలాడేసుకొని తన ముందు వెళ్లే వారిని అనుసరించడమే దాని ఆచరణ. మెదడు అనేది ఒక కీలక, ఉపయుక్తమైన అవయవం తనకు ఉన్నది, దానిని ఉపయోగించి మసలుకోవాలి అనే స్పృహ దానికి ఉన్నట్లుగా ఒక్క దాఖలా కూడా ఇప్పటి వరకు కనిపించలేదు. "తాను మునిగిందే గంగ, తాను వలచిందే రంభ" అనే ధోరణిలో ఉన్న ఈ మందకు తమ వాళ్ళు, తమ యజమాని చెప్పింది మాత్రమే వేదం. అలా వాళ్ల యజమాని చెప్పిన విషయాలకు మమ అనడం, తలాడించడం, ఆ యజమాని చూపిన దారిలో నడవడం అనేవి ఒక ఆదేశంగా గుడ్డిగా పాటించడం, అనుసరించడం, అనుకరించడం మాత్రమే ఆ మందకు తెలుసు. అలాంటి మందకు జ్ఞానం, భోధ అనేవి వృధా ప్రయాసలే. యజమానులను మాత్రమే గుడ్డిగా నమ్మేయడం. దానిలో నిజం ఏమిటో తెలుసుకోకుండా ఆ విషయాలను విస్తృతంగా ప్రచారంలో పెట్టడం, వాటిని ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం వీటి పని. తమ వారు కారు అని అవి భావించిన వారు చెప్పేవన్నీ అసత్యాలు అనే అంధ విశ్వాసంతో ఉండే ఈ జీవులకు ఆ విషయాల్లోని హేతుబద్ధతను ప్రశ్నించిన వారిపై అగ్రహించడం, అందుకు



గాను వారిని ద్వేషించడం, వారిపై ఆ కారణంతో విషం కక్కడం మాత్రమే చేస్తున్నప్పుడు జ్ఞానము, భోధ అనేవి అనవసర వెర్రి యత్నాలే అవుతాయి. అయితే ఇది అసలైన సాదు జీవుల లాంటి గొర్రెల మంద కాదు కదా. అచ్చంగా ఆ గొర్రెల లక్షణాలనే పుణికి పుచ్చుకున్న ఒక మానవ రూపంలో ఉన్న ఒక మూర్ఖ మూక అన్నట్లు.

మొత్తం జీవకోటిలో మెదడు బాగా ఉపయోగించే తెలివైన మానవ జాతిలో ఇలాంటి వర్గం కూడా ఒకటి తయారు కావడం చాలా ఆశ్చర్యకరమైన పరిణామం. కానీ ఈ నేలపై మాత్రంఅది సంభవించింది. ఇప్పుడు దాని సంతతి బాగా పెరిగి పోయింది కూడా. దేశవ్యాప్తంగా విస్తరించి పోయింది. చాలా చోట్ల ఇది దర్బార్లను కూడా నడుపుతుంది. యజమాని చెప్పిన దోవలో నడవడం మినహా స్వంతంగా ఏమీ ఆలోచించని మంద ఇది. తన యజమాని ఏమి చెబుతున్నాడో? ఎందుకు చెబుతున్నాడో? యజమాని లక్ష్యం ఏమిటో?కనీస మాత్రంగా కూడా ఆలోచించని ఈ మూర్ఖ, భృత్య మందను జెన్ జీ ఎదుర్కోవాలి. దానికి అధికార అండదండలు పుష్కలంగా ఉన్న సంగతిని జెన్ జీ గుర్తు పెట్టుకొని మసలుకోవాలి. యజమాని చెప్పిన పని చేయడం మినహా పుట్టుకతో వచ్చిన జ్ఞానేంద్రియాల ఉపయోగం ఎరుగని అంధకోటి ఇది అనే గ్రహింపుతో జెన్ జీ మసలుకోవాలి. మనిషి ఇప్పుడు ఏ కాలంలో జీవిస్తున్నాడు? ఇప్పటి సామాజిక పరిస్థితులు ఏమిటి ?అనే వాస్తవిక స్థితిని కనీస మాత్రంగా కూడా అర్థం చేసుకోలేని, స్పృహ, విచక్షణ, అనేవి ఏ మాత్రం లేకుండా ప్రవర్తించే ఈ మూకను జాగ్రత్తగా ఎదుర్కోవాలి. ఈ మూకనే ఇప్పటి ఈ దేశ అధికారానికి మంద బలం అనే గ్రహింపు చాలా అవసరం. ఈ మంద బలం అండతో దశాబ్ద కాలం పైగా ఈ దేశ అధికారం అనేక అరాచకాలకు పాల్పడింది. ఇప్పటికే ప్రజాస్వామిక రాజ్య వ్యవస్థలను చాలా వరకు ధ్వంసం చేసి పారేసింది.

అన్ని మానవ విలువలును మంట గలిపేసింది. దేశ ప్రజలు ఉత్పత్తి చేసిన సంపదలో సింహ భాగం తనకు సన్నిహితులైన ఒకరిద్దరు కుబేరులకు దోచి పెడుతున్నది. ప్రజాస్వామ్యానికి వెన్నెముక లాంటి ఎన్నికల వ్యవస్థను తన కీలుబొమ్మగా మార్చి వేసుకుంది. దేశాన్ని వెనకటి కాలానికి తీసుకొని వెళ్లే కుట్రలకు పాల్పడుతున్నది. ఈ సమాజంపై సంపూర్ణ అధికారం, ఆధిపత్యం మాత్రమే తమ లక్ష్యంగా ఎంచుకున్న ఈ వర్గానికి సమాజం ఏమైపోయినా పర్వాలేదు. చూసి రమ్మని చెబితే కాల్చి వచ్చే ఈ మూర్ఖ మంద వేలాది అందమైన పేర్లు కలిగిన అనేక సంఘాల పేరిట ఇక్కడ చలామణి అవుతున్నది. తమ యజమాని గుంపులోని వారు ఏ పని చేసినా, ఎలాంటి నేరం, క్రూరమైన ఘోరానికి పాల్పడినా ఈ మంద నోరు పెగలదు. అలాంటి వారికి సంపూర్ణ రక్షణను కల్పిస్తూ, వారిపై ఈగను సైతం వాల నివ్వకుండా చూస్తున్నది. అలాంటి పనులే తమ వారు కారు అని ఈ మంద భావించిన వాళ్లు చేస్తే మాత్రం ఇల్లు పీకి పందిరి వేస్తుంది. లోకంలోని తమ వారిని అందరినీ ఏకం చేసి సదరు ఇతరులను అసభ్యకరమైన భాషలో దూషిస్తుంది. అవసరాన్ని బట్టి వారిపై భౌతిక దాడులకు కూడా పాల్పడుతుంది. అలాంటి దాడుల్లో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం సైతం ఉంటుంది. అలా ఈ మూక, మంద చేసిన దాడుల్లో అమాయకులు, నిరపరాధులు ప్రాణాలు కోల్పోయిన ఉదంతాల సంఖ్య కూడా గణనీయంగానే ఉన్నది.

అధికారం అండదండలు పుష్కలంగా ఉండడం వల్ల దేశంలోని చాలా ప్రాంతాల్లో ఇవి అనధికారిక అధికార మూకలుగా రూపుదిద్దుకున్నాయి. దీంతో పోలీసులు గానీ అధికార యంత్రాంగం గానీ ఈ మంద జోలికి వెళ్లవు. ఏమి చేసినా పట్టించుకోవు. పైగా మందకు రక్షణను కల్పిస్తాయి కూడా. ఇలాంటి అన్యాయమైన అరాచక పరిస్థితుల్లో ఈ మంద భయానికి పౌర సమాజం నోరు తెరవడం దాదాపుగా మానేసింది. ఫలితంగా దీని అరాచకాలకు ఎలాంటి అడ్డూ లేకుండా పోయింది. అయితే ఎదురే లేని ఈ మందకు ఇటీవల ఈ దేశ యువశక్తి పెద్ద ఎదురు దెబ్బ వేసింది. విద్యావంతులైన జెన్ జీ (నిరుద్యోగ యువత) అధికారం చేసిన, చేస్తున్న అక్రమాలను ప్రశ్నించడం, నిలదీయడం వీధుల్లోకి రావడంతో అధికారానికి, ఈ మందకు జీర్ణం కాలేదు. జెన్ జీ దేశ రాజధానిలో ఈ మధ్య భారీ నిరసన ప్రదర్శనను నిర్వహించింది. ఈ నిరసన, ఆందోళనలను దెబ్బ తీసి, అణచివేసే అనేక కుయత్నాలను అధికారం, దాని మంద పాల్పడింది. వారిపై లాఠీలను ప్రయోగించింది. తూటాలను పేల్చింది.

బాష్ప వాయువుతో యువతను భయపెట్టి చెదర గొట్టే ప్రయత్నాలను చేసింది. అత్యంత క్రూరమైన పెల్లెట్ గన్‌లను ఉపయోగించి గాయపరచింది. నిరసన శిబిరంలోకి ఈ మూర్ఖ మూకలోని పలువురు చొరబడి ఆందోళనను విచ్ఛిన్నం వేసే ప్రయత్నాలను సైతం చేసింది. ఈ దాడులు, దౌర్జన్యాలు, కుట్రలను విద్యావంతులైన నిరుద్యోగ యువశక్తి ధీటుగా ఎదుర్కొని స్థిరంగా నిలబడి తన ఆందోళనను ధైర్యంగా కొనసాగించింది. ఆందోళనకు మద్దతుగా ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు నిరాహార దీక్షకు పూను కోవడంతో ఆందోళనకు దేశ వ్యాప్తంగా మద్దతు లభించింది. ఆయన ఆరోగ్యం క్షీణించడంతో దీక్షను భగ్నం చేసింది. అయినప్పటికే ఆందోళన కొనసాగుతూనే ఉండడంతో అధికారం తొలిసారిగా భయపడింది. తలవంచింది. ఆ పరీక్షా పత్రాల లీకేజీకి బాధ్యుడైన మంత్రి రాజీనామా చేయవలసి వచ్చింది. అయినా అధికార అహంకారం వెలుపలికి మేకపోతు గాంభీర్యాన్నే ప్రదర్శించింది. ఆందోళనను అణచివేసే యత్నాలను మరింత ముమ్మరం చేసింది. అయినా జెన్ జీ భయపడలేదు. దీంతో అధికారం మరో మార్గంలో యువత ఆగ్రహాన్ని చల్లార్చే ప్రయత్నాలను మొదలు పెట్టింది. దేశంలోని యువజనుల ఆలోచనలు తెలుసుకునే ప్రయత్నాలను ఈ అధికార శక్తికి తల్లి సంస్థ మొదలు పెట్టింది. ఆయన జెన్ జీ తో మాట్లాడే ప్రయత్నాలు చేశారు. ఇదీ ప్రస్తుత స్థితి. దీనిపై అధికారం ఎలా ప్రతి స్పందిస్తుందో, జెన్ జీ నుంచి ఎలాంటి ప్రతి స్పందన వస్తుందో రానున్న కాలమే నిర్ణయిస్తుంది. ప్రస్తుతానికి అయితే ఈ సమాజం ఒక ప్రతిష్టంభన దశలో ఉన్నది. అధికార అహంకారంజెన్ జీ మధ్య కొనసాగుతున్న ఈ పోరాటంలో ఎవరు పైచేయి సాధిస్తారనే సంగతే ఈ దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. అధికార కుట్రలు ఫలిస్తాయా, జెన్ జీ ఉద్యమం విజయం సాధించగలదా అనే విషయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. దేశం వెలుపలి అంతర్జాతీయ సమాజానికి కూడా ఈ పరిణామాలు ఆసక్తికర మైనవిగానే ఉన్నట్లు వెలువడుతున్న వార్తా కథనాలు చెబుతున్నాయి.



- గందె గోవర్ధన్,
ఫోన్ : 9347056621

## వ్యాసాలు, కవితలకు ఆహ్వానం

విశ్వంభర ఎడిటోరియల్ పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను, కవితలను ఆహ్వానిస్తున్నాం. ఈ కింది చిరునామాకు పోస్టులో లేదా ఈ-మెయిల్ ద్వారా పంపించగలరు. మీ వ్యాసం 1000 పదాలకు మించకుండా ఉండాలి. తెలుగు యునీకోడ్‌లో టైప్ చేసి పంపిన వాటికి ప్రాధాన్యం ఉంటుంది. రచయితలు విశ్వంభరకు మాత్రమే పంపుతున్నామని హామీపత్రం జత చేయాలి.

**చిరునామా:**
V3 న్యూస్, విశ్వంభర తెలుగు దినప్రతిక కార్యాలయం, ప్లాట్ నంబర్ 204, రెండో అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నంబర్ 1560 ఎదురుగా, చైతన్యపురి ఎక్స్ రోడ్డు, హైదరాబాద్500060

editpagevishwambhara@gmail.com

ఇతర వివరాలకు సెల్ నం: 9441222429 సంప్రదించగలరు.

# అంతర్జాతీయ ఆదివాసీ దినం

1994లో..... ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం ఆగస్టు 9ను అంతర్జాతీయ ఆదివాసీ దినంగా ప్రకటించింది. ఈ దినం ప్రపంచ ఆదివాసీ ప్రజల సంస్కృతి, హక్కులు, సమస్యలు, జీవన విధానం, సమాజానికి వారు అందించిన సేవలను గుర్తు చేసుకునే సందర్భంగా నిర్వహించబడుతోంది.

భారతదేశంలోని పర్వత ప్రాంతాలు, అడవులు, మైదాన ప్రాంతాల్లో ఆదివాసీ తెగలు నివసిస్తున్నాయి. 2011 జనగణన ప్రకారం భారత జనాభాలో దాదాపు 8.6 శాతం మంది ఆదివాసీలు ఉన్నారు. సాపేక్షికంగా వెనుకబడిన ఉత్పత్తి శక్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ సమాజాల ఆర్థిక వ్యవస్థ, సంస్కృతి, జీవన విధానం మిగతా భారత సమాజంతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. గిరిజన రైతాంగ జీవితం అడవితో, భూమితో ఎంత పెనవేసుకుపోయిందో, పోరాటంతో కూడా అంతే పెనవేసుకుపోయింది.



గిరిజనులు అడవిలోని క్రూర మృగాలకు వ్యతిరేకంగా మాత్రమే కాదు, తమ భూమి కోసం, తమ సంస్కృతి కోసం, తమ అస్తిత్వం కోసం, తమ ఆత్మగౌరవం కోసం, అడవిపై తమ సహజ హక్కుల కోసం తరతరాలుగా దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నారు. మగధ సామ్రాజ్య స్థాపనకు ముందే దేశంలోని అనేక ఆదివాసీ రాజ్యాలపై దాడులు జరిగాయి. తరువాత వివిధ రాజవంశాలు, బ్రిటిష్ వలస పాలకులు కూడా ఆదివాసీ ప్రాంతాలను తమ పాలనలో భాగం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, జార్ఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్, ఈశాన్య రాష్ట్రాల్లో వందలాది ఆదివాసీ రాజ్యాలు, స్వయంపాలిత ప్రాంతాలు క్రమంగా ఆక్రమణకు గురయ్యాయి.

బ్రిటిష్ పాలకులు అడవులను ప్రభుత్వ ఆస్తిగా ప్రకటించి అటవీ చట్టాలను అమలు చేశారు. దాంతో గిరిజనులకు అడవిపై ఉన్న సహజ హక్కులు కాలరాయబడ్డాయి. జమీందారులు, వడ్డీ వ్యాపారులు, మధ్యవర్తుల ద్వారా ఆదివాసీలపై తీవ్రమైన దోపిడీ కొనసాగింది. స్వాతంత్ర్యం తరువాత తెల్ల దొరల స్థానంలో నల్ల దొరలు వచ్చినా, ఆదివాసీల జీవితాల్లో మౌలిక మార్పు రాలేదు. పాలకులు మారినా దోపిడీ రూపాలు మాత్రమే మారాయి.

ఆదివాసీ ప్రజలు తమ స్వతంత్ర సామాజిక వ్యవస్థల్లో జీవించిన కాలంలో వారి ఆచారాలు, విశ్వాసాలే వారి జీవన విధానం. తరువాత వివిధ రాజ్యాల విస్తరణతో పాటు హిందూ, ఇస్లాం, క్రైస్తవ మతాల ప్రభావం కూడా ఆదివాసీ ప్రాంతాలకు చేరింది. భారత చరిత్రలో ఏ పాలక వర్గం అధికారంలో ఉన్నా తమ రాజకీయ, సామాజిక ప్రయోజనాలకు అనుగుణంగా మత వ్యాప్తిని ప్రోత్సహించిన వాస్తవాన్ని విస్మరించలేం. నేటికీ అనేక ఆదివాసీ తెగలు తమ సంప్రదాయ విశ్వాసాలను కొనసాగిస్తుండగా, వివిధ మత సంస్థలు తమ ప్రభావాన్ని విస్తరించే ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి.

భారతదేశంలోని ఆదివాసీ ప్రాంతాల్లో దేశ ఖనిజ సంపదలో అత్యధిక భాగం ఉంది. బొగ్గు, ఇనుప ఖనిజం, బాక్సైట్, మాంగనీస్ వంటి ఖనిజాలతో పాటు ఇటీవల వ్యూహాత్మక ప్రాధాన్యం పొందుతున్న అనేక ఖనిజాల కోసం గనుల తవ్వకాలు వేగవంతమవుతున్నాయి. వలస పాలనలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఈ వనరులను కొల్లగొట్టగా, నేడు భారతీయ పెద్ద పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాద గుత్త కంపెనీలు, కార్పొరేట్ సంస్థలు అదే ప్రక్రియను కొత్త రూపంలో కొనసాగిస్తున్నాయి.


అటవీ హక్కుల చట్టం (2006), పెసా చట్టం వంటి చట్టాలు అమలులో ఉన్నప్పటికీ, భూమి హక్కుల గుర్తింపు, సామూహిక అటవీ హక్కుల అమలు, గ్రామసభల నిర్ణయాధికారానికి పూర్తి స్థాయిలో గౌరవం లభించడం లేదు. అడవి సంరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, గనుల తవ్వకాలు, పరిశ్రమలు, ఆనకట్టలు, ఇతర అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో వేలాది ఆదివాసీ కుటుంబాలు నిర్వాసితులవుతున్నాయి. వాతావరణ మార్పులు, అడవుల క్షీణత, నీటి వనరుల తగ్గుదల కూడా వారి జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

భారతదేశ గిరిజన పోరాటాలకు రెండు శతాబ్దాలకు పైగా మహోన్నత చరిత్ర ఉంది. సంతాల్ తిరుగుబాటు, ముండా ఉద్యమం, కోందు పోరాటం, గోండు తిరుగుబాట్లు, మన్యం పోరాటం, వర్లీ ఉద్యమం, ఇంద్రవెల్లి పోరాటం, సమ్మక్క-సారలమ్మ పోరాట సంప్రదాయం, ఈశాన్య భారత ఆదివాసీ ఉద్యమాలు ఈ చరిత్రలో విశిష్ట స్థానాన్ని పొందాయి. కొమురం భీమ్, బిర్సా ముండా, గుండా ధూర్, అల్లూరి సీతారామరాజు, వెంపటాపు సత్యం, కోరన్న, మంగన్న, హరిభూషణ్, ఇడుమాల్, నీతూ, పంచాది నిర్మల, సామ పూలక్క వంటి వేలాది మంది పోరాట యోధులు తమ ప్రాణాలను అర్పించారు. వారి త్యాగాలు భారత ప్రజా పోరాటాల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి.

ఆదివాసుల సమస్య కేవలం వెనుకబాటుతనం కాదు. భూమి, నీరు, అడవి, ఖనిజ సంపదను కోల్పోవడం మాత్రమే కాదు; చౌక శ్రమశక్తి దోపిడీ, నిరుద్యోగం, నిర్వాసితత్వం, పేదరికం, సాంస్కృతిక విచ్ఛిన్నం కూడా వారి జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. దేశ సంపదను సృష్టిస్తున్న శ్రమజీవులే తమ జీవనాధారాలను కోల్పోతుండగా, ప్రకృతి సంపదపై ఆధిపత్యం కలిగిన కార్పొరేట్ గుత్త సంస్థలు అపారమైన లాభాలను ఆర్జిస్తున్నాయి. ఈ వైరుధ్యమే నేటి ఆదివాసీ ప్రశ్నకు కేంద్ర బిందువు.

జలజంగల్‌జమీన్ అనేది ఆదివాసీలకు కేవలం నినాదం కాదు. అది వారి ఉత్పత్తి వ్యవస్థ, జీవనాధారం, సంస్కృతి, సామాజిక సంబంధాలు, అస్తిత్వానికి పునాది. ఈ పునాదిని బలహీనపరిస్తే ఆదివాసీ సమాజం మొత్తం సంక్షోభంలోకి నెట్టబడుతుంది. అందువల్ల భూమి, అడవి, ఖనిజ సంపదలపై ప్రజల హక్కులను రక్షించకుండా ఆదివాసీ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధ్యం కాదు.

అంతర్జాతీయ ఆదివాసీ దినం కేవలం ఒక సాంస్కృతిక వేడుక మాత్రమే కాదు. కార్మికులు, రైతులు, ఆదివాసీలు, దళితులు, ఇతర శ్రమజీవి వర్గాల ఉమ్మడి ప్రయోజనాలను గుర్తు చేసుకునే రోజు. ఆదివాసీల భూమి, అటవీ హక్కులు, గ్రామసభ అధికారాలు, సంస్కృతి, ఆత్మగౌరవాన్ని పరిరక్షించే పోరాటాలకు సంఘీభావం ప్రకటించే రోజు. కార్పొరేట్ పెట్టుబడిదారీ వర్గాల దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక హక్కుల కోసం, సహజ వనరులపై ప్రజల హక్కుల కోసం పోరాట సంకల్పాన్ని పునరుద్ఘాటించే రోజు.



- జంపన్న,
డెమోక్రటిక్ సోషలిస్ట్